పరిశోధనలు సమాజానికి మేలు చేయాలి



ప్యానల్ డిస్కషన్‌లో పాల్గొన్న అతిథులతో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొ.పీజే నారాయణన్

- ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొ.పీజే నారాయణన్
- ట్రిపుల్‌ఐటీ ఆర్ అండ్ డీ షోకేస్ అదుర్స్
- 28 పరిశోధనా కేంద్రాల నుంచి 300కిపైగా పోస్టర్లు డెమోలు, నమూనాల ప్రదర్శన



డీ షోకేస్‌లో రాజస్థాన్ ఇళ్ల నమూనాలు

రాయదుర్గం: నూతన ఆవిష్కరణలు.. రకరకాల పోస్టర్లు... ఆయా అంశాలపై ఆలోచింపచేసేలా ప్రదర్శన సాగింది. గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో రెండు రోజులపాటు సాగే వార్షిక ఆర్ అండ్ డీ షోకేస్‌ను శనివారం ప్రారంభించారు. ట్రిపుల్ ఐటీలోని 28 పరిశోధనా కేంద్రాల నుంచి 300కి పైగా పోస్టర్లు, డెమోలు, నమూనాలను ఇందులో ప్రదర్శించడం విశేషం. ముఖ్యంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యుగంలో బాధ్యతాయుతమైన ఏఐ, రీథింకింగ్‌పై రౌండ్ టేబుల్ చర్చలు, పరిశోధనా రిఫ్లెక్షన్‌లు, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(సీఐఈ) ద్వారా పరిశోధనా స్టార్టప్‌లను కూడా షోకేస్‌లో ప్రదర్శించారు. ఈ షోకేస్‌లో అడ్వాన్స్ మల్టీ మోడల్ రీసెర్చ్ వెహికిల్, మల్టీ సెన్సార్ బైక్ ప్లాట్‌పామ్ పర్ ఇండియన్ టు వీలర్ డ్రైవింగ్ డేటా సెట్ వాహనం ప్రదర్శనలో, సిస్మోగ్రాఫ్ డిస్‌ప్లే, ప్రత్యేకంగా రూపొందించిన డ్రోన్, రాజస్థాన్ ఇళ్ల నమూనాలు ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి. సమాజానికి మేలు చేసేలా అధ్యాపకులు, విద్యార్థుల పరిశోధనలు ఉంటాయని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా 'రైట్ టు నో యువర్ అల్గారిథమ్'లపై చర్చా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉషా రామనాథన్, సెంటర్ ఫర్ ఇంటర్‌నెట్ అండ్ సొసైటీ బెంగళూరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తన్వీర్ హసన్, నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా ప్రొఫెసర్ కృష్ణ, శ్రీనివాస్, పాల్గొన్నారు. అనంతరం టెక్ బదిలీ కార్యాలయంలో సాయంత్రం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పేటెంట్ గ్రహీతలను సత్కరించారు.

ప్రపంచాన్ని ఎదుర్కోవాలంటే ధైర్యం చాలా అవసరం



ఉమెన్ సేఫ్టీ వింగ్ పోలీస్ అధికారి రీమా రాజేశ్వరి

హఫీజ్‌పేట్: ప్రపంచాన్ని ఎదుర్కోవడానికి ధైర్యం చాలా అవసరమని ఉమెన్ సేఫ్టీవింగ్ పోలీస్ అధికారి రీమా రాజేశ్వరి పేర్కొన్నారు. శనివారం చందానగర్ గంగారంలోని మహిళా దక్షిత సమితి, మహిళ దక్షిత సమితి విద్యా సంస్థలు, సుమన్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఉమెన్ సేఫ్టీ వింగ్ రీమ రాజేశ్వరి, టెక్నికల్ డైరెక్టర్, శ్రీ సిమెంట్ ఇండిపెండెంట్ డైరెక్టర్ ఉమా గోర్క, మహిళా దక్షిత సమితి విద్యా సంస్థల ట్రస్టీ సభ్యులు సౌరబ్ కొఠారి, మహిళా దక్షత సమితి అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ధైర్యంతో పాటుగా ఆత్మరక్షణ చాలా అవసరమన్నారు. ప్రతి నిర్ణయాన్ని స్వతహాగా తీసుకుంటూ ముందుకు వెళ్ళాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో శకుంతల, ఉషా మాల్పాని, నళిని, అనసూయ, కళాశాల పిన్సిపల్ రమాకుమారి, సుశీల పాటిల్, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికోసం బీజేపీ, కాంగ్రెస్ కలిసికట్టుగా కుట్ర

ఎమ్మెల్యే గాంధీ.. మియాపూర్ ఎక్స్‌రోడ్డులో బీఆర్ఎస్ నాయకుల నిరసన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్: రాజకీయ ప్రత్యర్థులను దెబ్బ తీసేందుకు మోదీ సర్కార్ కుట్రలు చేస్తుందని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా మియాపూర్ ఎక్స్‌రోడ్డులో కార్పొరేటర్లు నాగేందర్ యాదవ్, శ్రీనివాస్‌రావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డి, మాధవరం రోజాదేవి ,మాజీ కార్పొరేటర్ సాయిబాబా, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎన్నికల్లో రాజకీయ లబ్ధికోసం బీజేపీ, కాంగ్రెస్ కలిసికట్టుగా కుట్రలు పన్నుతున్నాయని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను దెబ్బతీయడం కోసం ఈ అరెస్ట్ అని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



పటాన్‌చెరులో..

పటాన్‌చెరు టౌన్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టును నిరసిస్తూ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో పటాన్‌చెరులోని అంబేద్కర్ చౌరస్తాలో జాతీయ రహదారిపై బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మెట్టుకుమార్ యాదవ్, పుష్ప, సింధులు జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లింగంపల్లి టు ఘట్‌కేసర్

విస్తరిస్తున్న ఎంఎంటీఎస్ రైలు సౌకర్యం





శేరిలింగంపల్లి: ఎంఎంటీఎస్ (మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టు సర్వీస్) రైలు సౌకర్యం మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తోంది. ఇప్పటికే సికింద్రాబాద్, నాంపల్లి, ఫలక్‌నామా వరకు ఎంఎంటీఎస్ రైలును పొడిగించగా ..తాజాగా ఘట్‌కేసర్ వరకు విస్తరించడంతో ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలిగింది.

ఘట్‌కేసర్‌కు ఎంఎంటీఎస్ సౌకర్యం

- లింగంపల్లి నుంచి ఘట్‌కేసర్‌కు ఎంఎటీఎస్ రైలు సౌకర్యం విస్తరించడంతో 123.52 కిలోమీటర్లకు పెరిగింది.
- ఈ కొత్త రైలు ఘట్‌కేసర్, చర్లపల్లి, మల్లాపూర్, నేరెడ్‌మెట్, సుచిత్రా, భూదేవినగర్ వంటి ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగుతాయి.
- మొదటి రైలు ఘట్‌కేసర్‌లో ఉదయం 7.20 గంటలకు ప్రారంభమై లింగంపల్లికి 9.15 గంటలకు చేరుకుంటుంది.
- చివరి రైలు లింగంపల్లిలో సాయంత్రం 5.45 ఆరంభమై ఘట్‌కేసర్‌కు రాత్రి 7.30 గంటలకు చేరుకుంటుంది. ఈ రైల్లో పీర్జాదిగూడ, సుచిత్రా సెంటర్, భూదేవినగర్, అమ్ముగూడ, నేరేడ్‌మెట్, మౌలాలి హౌసింగ్‌బోర్డు హైలెవల్ స్టేషన్లు ఏర్పాటు చేశారు.

యాదగిరిగుట్టకు వెళ్లే వారికి మేలు

- లింగంపల్లి, పరిసర ప్రాంతాల నుంచి యాదగిరిగుట్టకు వెళ్ళాలంటే బస్సులో రాకపోకలు ఉంటాయి. ఎక్కు శాతం బస్సులపైనే ఆధారపడాల్సి వస్తోంది.
- ఈ నేపథ్యంలో ఘట్‌కేసర్ వరకు ఎంఎంటీఎస్ రైలు సౌకర్యం ఉండడంతో అక్కడి వరకు వెళ్లి తర్వాత ప్రైవేటు వాహనాల్లో భువనగిరి మీదుగా యాదగిరిగుట్టకు వెళ్లవచ్చు.

నాంపల్లి, ఫలక్‌నామా, మేడ్చల్‌కు ..

- లింగంపల్లి నుంచి ఇప్పటికే నాంపల్లి, ఫలక్‌నామా, మేడ్చల్ వరకు వెళ్లొచ్చు
- ప్రయాణికులకు సౌకర్యంతో బాటు తక్కువ చార్జీ ఉండడంతో ఎంఎంటీఎస్ లలో రద్దీ పెరిగిపోతోంది.
- ట్రాఫిక్ రద్దీ నుంచి ప్రయాణికులకు విముక్తి కలిగించేందుకు ఎంఎంటీఎస్ ఉపయుక్తంగా మారింది.
- ఇక కొత్తగా పలు ప్రాంతాలకు ఎంఎంటీఎస్ సేవలను విస్తరించడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం లేకపోలేదు. లింగంపల్లి ఎంఎంటీఎస్ స్టేషన్ వైపు మరిన్ని సౌకర్యాలను కూడా మెరుగుపరచాల్సిన అవసరం ఉంది.

గ్రాడ్యుయేషన్ డే



గచ్చిబౌలి: మాదాపూర్ బచ్‌పన్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు పట్టాలు, మెడల్స్ అందజేశారు.యూకేజీ విద్యార్థులు సందడిగా గడిపారు. ప్రిన్సిపల్ నిషా, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అనంత పద్మనాభ స్వామి బ్రహ్మోత్సవాలు

పటాన్‌చెరు: అనంత పద్మనాభస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల గ్రామంలో శనివారం శ్రీలక్ష్మీ అనంత పద్మనాభస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో మధు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు నీలం మధును సత్కరించారు.

ముగిసిన హస్తకళా ఉత్సవ్

మాదాపూర్: మాదాపూర్‌లోని నిఫ్ట్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన హస్తకళా ఉత్సవ్ శనివారంతో ముగిసింది. దేశం నలుమూలల నుంచి వచ్చిన చేనేత, హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను నగరవాసులు కొనుగోలు చేశారు. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు లైవ్ డెమానిస్ట్రేషన్, వర్క్‌షాప్‌లను నిర్వహించారు. కళాకారులకు నగర మార్కెట్‌పై అవగాహన కల్పించారు. మోడల్స్ చేనేత వస్త్రాలను ధరించి ర్యాంప్‌పై క్యాట్ వాక్ చేశారు. చెక్క, వెండి, వెదురు, రాగి, అద్దాలు, పూసలతో తయారు చేసిన ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మహాబాల కేఫ్ ప్రారంభం

హఫీజ్‌పేట్: డివిజన్ పరిధిలోని మంజీర రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మహాబాల కేఫ్‌ను శనివారం ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మాధవరం రంగారావు, మాజీ కార్పొరేటర్ రంగారావు, గౌతమ్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, భాస్కర్, బేగ్, రఘునాథ్, మల్లేష్, శ్రీను, కరీం, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మోహినీయట్టం

మాదాపూర్: కళాకారులు భరతనాట్యం, మోహినియట్టం ప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం కోల్‌కత్తాకు చెందిన భరతనాట్య కళాకారుడు కరుణ కేతన్ శంకర శ్రీగిరి, రామచంద్ర భజన, దేశ్ తిల్లాన అంశాలను ప్రదర్శించి అలరించారు. నిత్య శిష్యబృందంచే మోహినీయట్టం, భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. ఇందులో రంగపూజ, గణేశకౌతం, భాగ్యదా లక్ష్మీ, మోహినియట్ట వర్ణం, మూషికవాహన, శబ్దం, కీర్తనం తదితర అంశాలను కళాకారులు నిత్య, శాన్వి, కృష, వామిక, వలిక, రిషిక, అలీన, సహస్ర తదితరులు ప్రదర్శించారు.



ఆర్ట్ గ్యాలరీలో చిత్ర ప్రదర్శన





మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శనివారం రెండు ప్రదర్శనలను ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డా.లక్ష్మి కళాకారులతో కలసి ప్రారంభించారు. కళాకారుడు యు.విజయ్‌కుమార్ వేసిన చిత్రాలను ట్రాన్సెండెంటల్ రియాలిటీ పేరిట ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన ఈనెల 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనలో దాదాపు 55 చిత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఆకట్టుకుంటున్న స్పందన్

కళాకారులు శ్రీనివాస్, శ్వేత వేసిన చిత్రాలను స్పందన్ పేరిట ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డా.,లక్ష్మి ప్రారంభించారు. ఈ ప్రదర్శన రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సాలార్‌జంగ్ మ్యూజియం మాజీ డైరెక్టర్ ఎ.నాగేందర్‌రెడ్డి, కళాకారులు అంజుపొద్దార్, రచయిత రత్నారావు, శేఖర్ పాల్గొన్నారు.

బీజేపీకి భారీ మెజార్టీ ఖాయం

పార్టీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

గచ్చిబౌలి: కేంద్రంలో బీజేపీ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్‌లో మై హోమ్ భుజ గేటెడ్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించాలంటే బీజేపీని గెలిపించాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలన్నారు. దేశంలో ఏ ప్రాంతానికి వెళ్ళినా డిజిటల్ ట్రాన్సాక్షన్స్ చేస్తున్నారని ఈ మార్పు నయా భారత్‌కు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. ప్రతి ఒక్కరూ బీజేపీకే ఓటు వేసి గెలిపించాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల సమస్యలు తీర్చడానికి మోడీ గ్యారంటీ కాగా, చేవెళ్ల అభివృద్ధికి విశ్వన్న షూరిటీగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహరాజు, పవన్, అరవింద్, సంతోష్, ప్రసాద్, పురుషోత్తమ్, అనితారెడ్డి పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వద్దు

రాయదుర్గం: పదో తరగతి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా విద్యార్థులకు సూచించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలంటే భయపడ వద్దని విద్యార్థులు ఇష్టంతో చదివితే మంచి మార్కులు సాధించడం సులువేనన్నారు. అనంతరం విద్యార్థులకు ప్యాడ్, పెన్, పెన్సిల్, జామెట్రీబాక్స్, స్కేల్‌లను అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజశేఖర్‌రెడ్డి, ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం శ్యామల, మణిమాధురి, వెంకట్‌రామ్‌రెడ్డి, నరహరి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నరేష్, అంజమ్మ ,రాజు ముదిరాజ్, రమేష్‌గౌడ్, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ ఎంఐజీలో మహిళా దినోత్సవం

శేరిలింగంపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు అత్యంత ప్రాధాన్యత కలిగిందని హఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజితాగౌడ్ పేర్కొన్నారు. భారతినగర్ డివిజన్‌లోని ఓల్డ్ ఎంఐజీ కాలనీలో శుక్రవారం రాత్రి జరిగిన మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచులను లక్షాధికారులను చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా వడ్డీలేని రుణాలను ఇవ్వడానికి ముందుకు రావడం శుభసూచకమన్నారు.

తారానగర్ రేషన్ షాపు తనిఖీ

శేరిలింగంపల్లి: రేషన్ పంపిణీని అస్తవ్యస్తం చేస్తే డీలర్‌షిప్ రద్దు చేయడం ఖాయమని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లిలోని తారానగర్‌లోని చౌక ధరల దుకాణాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ పంపిణీ సరిగా లేకపోవడంను గుర్తించి తాత్కాలికంగా సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరుకుల పంపిణీ, షాపు నిర్వహణ సరిగా లేదన్న ఫిర్యాదుల నేపథ్యంలో 436 చౌక దుకాణానికి సీల్ వేసినట్లు ప్రకటించారు. నెలల తరబడి షాపు తీయటం లేదని స్థానికులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలి

సినీనటి మంచులక్ష్మి



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సినీనటి మంచు లక్ష్మీ, ఆర్‌పి పట్నాయక్

రాయదుర్గం: ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక టాలెంట్ ఉంటుందని, దాన్నిఅందరూ గుర్తించాలని సినీ నటి మంచులక్ష్మీ సూచించారు. గచ్చిబౌలి శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో మర్హామ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఆటిజం ఆరా పేరిట ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ దివ్యాంగులను ప్రోత్సహించాలని, కానీ వారి లోపాన్ని ఎత్తి చూపకూడదన్నారు. తల్లిదండ్రులు ముఖ్యంగా తమ సంతానంలో దివ్యాంగులుంటే వారిలోని టాలెంట్ గుర్తించి ప్రోత్సహించాలన్నారు. సంగీత దర్శకుడు ఆర్ పిపట్నాయక్ మాట్లాడుతూ మర్హామ్ సంస్థ ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహించి అందరిలోనూ ఆత్మవిశ్వాసం పెంచాలన్నారు. అనంతరం కామిని సరాఫ్,మంజు కళానిధి,అర్చన సురేష్ ,కోకర్మ వ్యవస్థాపకుడు తరుణ్ ప్రసంగించారు.

మ్యూజికల్ గాలా, నృత్య ప్రదర్శనలు, ఫ్యాషన్ షో

ఆటిజమ్ స్పెక్ట్రమ్ డిజార్డర్(ఏఎస్‌డీ) ఉన్న వ్యక్తుల కోసం సేవలందించడానికి విశేషంగా కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థ మర్హామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటిజం ఆరాలో భాగంగా నిర్వహించిన క్లాసికల్ ఫ్యూజన్, జానపద ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఫ్యాషన్ షో నిర్వహించారు.అనంతరం ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్‌పి పట్నాయక్ ఆధ్వర్యంలో సంగీత బృందం అందించిన మ్యూజికల్ గాలా అలరించింది.

హాస్టల్ నిర్వాహకుడి ఆత్మహత్య

గచ్చిబౌలి: పీజీ హాస్టల్ నిర్వహిస్తున్న ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శోభన్‌బాబు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా, పి.గన్నవరం, ఎర్రంశెట్టివారి పాలెం గ్రామానికి చెందిన ఎం.దుర్గా ప్రసాద్(29) సంవత్సరం నుంచి గచ్చిబౌలి వీధి నంబర్ 3లో శ్రీదుర్గ మెన్స్ పీజీ హాస్టల్ నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం 9 గంటల సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు పూర్తిగా తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు. కాగా అద్దె విషయంలో భవన యజమానికి దుర్గాప్రసాద్‌కు కొంత కాలంగా వివాదం ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పూడికతీత.. సాఫీగా ప్రవాహం



తారానగర్‌లో..



హుడా ట్రేడ్‌సెంటర్‌లో.. సాఫీగా ప్రవహిస్తున్న మురుగునీరు

ఈసారి ముందస్తు చర్యలు.. సాఫీగా ప్రవహిస్తున్న నీరు

శేరిలింగంపల్లి: పూడికతీత పనులను ఈసారి ముందుగానే ప్రారంభించారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పనులను పూర్తి చేయడానికి ముందస్తు చర్యలు చేపట్టారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలోని నాలాలు, మురుగు కాలువలు, వరదనీటి కాలువల్లో పూడిక తీయాలని నిర్ణయించారు. అందులో భాగంగా నాలాల్లో జేసీబీ సహాయంతో పూడికతీసి డంపింగ్ కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో నాలాల పూడికతీత ప్రగతిపై సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి సమీక్షిస్తున్నారు.

సర్కిల్ పరిధిలో పూడికతీసే నాలాలు ..

- గచ్చిబౌలి డివిజన్‌లోని నల్లగండ్ల చెరువు నుంచి డాక్టర్స్ కాలనీ వరకు..
- శేరిలింగంపల్లి డివిజన్ లింగంపల్లి ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ నుంచి తారానగర్ వరకు
- గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలోని వెస్ట్రన్ ప్లాజా నుంచి పంచవటి కాలనీ వరకు
- కొండాపూర్ డివిజన్ దుర్గంచెరువు నాలా, దుర్గం చెరువు ఎస్టీపీ నుంచి కళ్యాణ్‌నగర్ వరకు నాలాల పూడికతీత కొనసాగుతోంది
- శేరిలింగంపల్లి డివిజన్‌లోని సుదర్శన్‌నగర్ కాలనీలో సాధారణ మురుగునీటి కాలువలు, వరద నీటి కాలువలలోనూ పూడికతీత పనులు చేపట్టారు.

అన్ని నాలాల్లో పూడికతీత

శేరిలింగంపల్లి ప్రాంతంలో మురుగు రోడ్డుపైకి రాకుండా నాలాలు, వరద, మురుగు కాలువలు సాఫీగా పారేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ పనులను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తుంటారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

– శేరిలింగంపల్లి ఈఈ శ్రీనివాస్